# సరిహద్దుల్లో సాహసం

## మావోయిస్టుల కోటలో బాబు ❑ వర్షంలోనూ నీరాజనం

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: అది శ్రీకాకుళం జిల్లాలోని ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంతం. మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతాలైన పాతపట్నం.. మెళియాపుట్టి.. పలాస.. మందస మండలాల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 'మీ కోసం' యాత్రను సాహసోపేతంగా సాగించారు. సోమవారం రాత్రి ఓవైపు వర్షం పడుతున్నా దట్టమైన అటవీప్రాంతంలోని గిరిజన గూడేల్లోంచి ముందుకు సాగారు. వర్షంలో తడుస్తూనే ప్రజలు చంద్రబాబుకు నీరాజనం పట్టారు. గతంలో ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రాంతాల మీదుగా యాత్ర సాగింది. ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామాల మీదుగా బాబు పర్యటిస్తున్నందున తమ సమస్యలు చెప్పుకొనేందుకు రాత్రిపూట వర్షంలో కూడా రహదారి వెంబడి పెద్దయెత్తున జనం బారులు తీరారు.

### ఆఫ్‌షోర్ డిజైన్ మారుస్తాం

మరో ఆరునెలల్లో తెదేపా అధికారంలోకి వస్తుంది. అంతవరకు పోరాటం చేద్దాం. అధికారంలోకి రాగానే జిల్లాలోని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ డిజైన్ మారుస్తామని నిర్వాసిత గ్రామాల ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు.

### మీ అంతరాల్లో నిలిచా.. మీ కోసం వచ్చా

గ్రామీణ పలాస: 'ఆడపడుచులు, చిన్నారులు, మహిళలు, వృద్ధుల అభిమాన పాత్రుడి నయ్యాను. మీ అందరి అంతరాల్లో నిలిచాను. ఇది పూర్వజన్మ సుకృతం' అంటూ తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు ఉద్వేగంతో పలికారు. పలాస మండలం టెక్కలిపట్నంలో సోమవారం రాత్రి జరిగిన మీ కోసం కార్యక్రమంలో జనం కేరింతల నడుమ ఆయన ఉపన్యాసం సాగింది.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముందుకు సాగుతానని.. అందుకు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొంటానని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా రైతులు, మహిళలు, యువతపైనే ఆయన ప్రసంగం సాగింది. 12 గంటల ఉచిత కరెంటు, ధాన్యం మద్దతు ధర రూ.1,000గా చేస్తామన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు మంగళసూత్రాన్ని ఇస్తానని చెప్పగానే మహిళలు పెద్దపెట్టున జేజేలు పలికారు. భారతదేశ చరిత్రలో 150 రోజుల పాటు ప్రజల కోసం ఇలాంటి యాత్ర నేనే చేశానని ఆయన చెప్పుకొచ్చారు. మీకోసమంటూ నేనొస్తే నా కోసం మీరు ఇంత శ్రమకోర్చి రావడం అమిత ఆనందాన్ని ఇస్తోందన్నారు. సాయంత్రం 5 గంటలకు రావాల్సిన ఆయన రాత్రి 9.30 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా ప్రజలు కూడా అంతవరకు వేచివున్నారు. ఆయన వెంట ఎర్రన్నాయుడు ఉన్నారు.



**మెళియాపుట్టి మండలంలోని మాకన్నపల్లి అటవీప్రాంతంలోంచి దూసుకొస్తున్న చంద్రబాబు కాన్వాయ్**